క్లుప్తంగా

విశేషంగా నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం సోమవారం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ: మండలంలో భర్నికం శివారు బాపదుపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ. 4 వేల విలువ చేసే విద్యా సామగ్రిని పాఠశాల హెచ్ఎం ఎం.కళావతి, ఉపాధ్యాయుడు గంగాధర్ సోమవారం అందజేశారు. నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిల్స్, రబ్బర్లు, షార్ప్నర్స్ వంటి సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల భానుమూర్తికి అభినందనలు



బాలభానుమూర్తి

సింహాచలం: అడవివరానికి చెందిన విజినిగిరి బాలభానుమూర్తికి జాతీయ సేవా రత్న అవార్డు లభించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న విజయవాడలో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం-2023లో ఈ అవార్డు అందుకున్నారు. 14 ఏళ్లుగా బాలభాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి సేవా రంగంలో తెలుగు వెలుగు విశిష్ట సేవా రత్న జాతీయ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ అన్నారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. రాంగ్ రూట్ ప్రయాణం చాలా ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ కె.స్వరూప పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెందుర్తి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫ్లోరాఅన్నారు. ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ కళాశాల నుంచి పెందుర్తి జంక్షన్ వరకు జరిగిన ర్యాలీలో డిప్యూటీ కలెక్టర్ శేషశైలజ, తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఆర్ఐ సాయికిరణ్, ఆదిత్య కళాశాల సెక్రటరీ థియోపిలస్ పాల్గొన్నారు.

బాగు బడి



నాడు: అభివృద్ధి చేయక ముందు పరవాడ బీసీ కాలనీ పాఠశాల దుస్థితి



నేడు: అభివృద్ధి చేసిన తర్వాత ఆహ్లాదకర వాతావరణంలో పాఠశాల



పాఠశాలలో ఏర్పాటు చేసిన కొత్త బెంచీలపై విద్యార్థులు



ఇది కదా అభివృద్ధి

చదువే పిల్లలకు ఇచ్చే ఆస్తి.. చదువే అన్నింటికీ మూలం.. కుటుంబ స్థితిగతులను మార్చే శక్తి చదువు సొంతం. అలాంటి విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించడానికి నాడు–నేడు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. బోధన పద్ధతులు మార్చడంతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్యా దీవెన,వసతి దీవెన,ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విద్యను బలోపేతం చేస్తున్నారు.

- కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు
- మనబడి నాడు- నేడుతో మారిన రూపురేఖలు
- డిజిటల్ బోర్డులు, నూతన బెంచీల ఏర్పాటు
- మెరుస్తున్న టాయిలెట్లు

నాడు- నేడు మొదటి దశ పాఠశాలలు 17

30 రెండో దశలో గుర్తించిన పాఠశాలలు

తొలి విడత పనులకు చేసిన ఖర్చు రూ.4.94 కోట్లు

రూ.9.81 కోట్లు రెండో విడత పనుల కోసం విడుదల చేసిన నిధులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. మూస పద్ధతిలో బోధనకు చెక్ పడింది. ఆధునిక పద్ధతులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠ్య పుస్తకాలను కూడా సీబీఎస్‌ఈ స్థాయిలో రూపొందించారు.దీంతో ఉచితంగా సర్కారు బడిలో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నారు.

సరి కొత్తగా సర్కారు పాఠశాలలు

మండలంలో 66 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నాడు-నేడు తొలి విడతలో 17 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో 30 పాఠశాలలు చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. తొలి విడత పాఠశాలల అభివృద్ధికి రూ.4.94 కోట్లు ఖర్చు చేశారు.

రెండో విడతలో ఎంపిక చేసిన 30 ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.9.81 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కల్పించిన సౌకర్యాలు

నేలబారు చదువులకు స్వస్తి పలికారు. విద్యార్థులు కూర్చోడానికి బల్లలు, మంచినీటి సదుపాయాలు, పాఠశాలలకు రక్షణ గోడలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు, తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలు, డిజిటల్ బోర్డులు, గోడలపై పెయింటింగ్స్.

ప్రగతి బాట ఇలా..

మండలంలో 66 ప్రభుత్వ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రైమరీ పాఠశాలలు-51, యూపీ పాఠశాలలు-2, జెడ్పీ పాఠశాలలు-12, రెసిడెన్షియల్ పాఠశాల- 1, పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల(పరవాడ)-1, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(తానాం) -1 ఉన్నాయి.

తొలి విడతలో అభివృద్ధి చెందిన పాఠశాలు

వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల, పరవాడ జెడ్పీ బాలికల పాఠశాల, లంకెలపాలెం జెడ్పీ పాఠశాల, తాడి, స్వయంభూవరం అప్పర్ ప్రైమరీ పాఠశాలలు.

మండల పరిషత్ పాఠశాలలు

భర్నికం, దలాయిపాలెం, కన్నూరు, ముత్యాలమ్మపాలెం, పరవాడ బీసీ కాలనీ, పెదముషిడివాడ, వెన్నలపాలెం, వెంకటపతిపాలెం, తానాం.

రెసిడెన్షియల్ పాఠశాలలు

తాడి, స్వయంభూవరం, రెసిడెన్షియల్ పాఠశాల (తానాం)



బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు



నూతనంగా నిర్మించిన టాయిలెట్స్

ఆహ్లాదకరంగా పాఠశాల



నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ బడిలోనే చదువుతున్నాను. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవాళ్లం. పాఠశాలలో నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసి మంచి మరుగుదొడ్లు కట్టారు. అనేక సదుపాయాలు కల్పించారు. పాఠశాలకు వచ్చిన తర్వాత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన రావడం లేదు. ఇంటి కంటే పాఠశాలలో మెరుగైన సదుపాయలు ఉన్నాయి. తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్దారు. మంచి ప్రమాణాలతో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

– బి.శ్రీవందన, 8 తరగతి, బాలికల జెడ్పీ పాఠశాల, పరవాడ

మా బడి భలే ఉంది



గతంలో మా పాఠశాల ఇరుగ్గా ఉండేది. కూర్చోవడానికి ఇబ్బంది పడేవాళ్లం. జగన్‌మామ మా బడిని అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పించడంతో బలేగుంది. ఐఎఫ్‌పీల ద్వారా ఉపాధ్యాయులు మంచి పాఠాలు బోధిస్తున్నారు. జగనన్న గోరు ముద్ద భోజనం రుచిగా ఉంది. పాఠశాలలో చదువుతో పాటు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండడంతో ఒత్తిడి అనిపించలేదు.

– యశ్వంత్ 10 తరగతి, జెడ్పీ పాఠశాల, వాడచీపురుపల్లి.

విద్యార్థుల్లో నూతన ఉత్సాహం



ప్రభుత్వం నాడు-నేడు పథకంలో పాఠశాలను అభివృద్ధి చేయడంతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. గతంలో బడికి రాని పిల్లలు కూడా నేడు చదువుపై శ్రద్ధ చూపిస్తున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నాం. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల మా బడి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉంది. బదీంతో తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు.

– యు.మనోరంజని, హెచ్ఎం, మండల పరిషత్ పాఠశాల, బీసీ కాలనీ

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

సబ్బవరం: ప్రజా సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని వంగలి సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్,పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ,వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్ ఆకుల శ్రీహేమ, ఈవోఆర్డీ మహేష్, మాజీ సర్పంచ్ కొటాన వెంకట రమణ,వేపాడ సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

శంభో శంకర



ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

పెందుర్తి: కార్తీక మాసం ఆఖరి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే బారులు తీరారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఉదయం నుంచి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

- పెందుర్తి శివాలయంలో విశేష పూజలు జరిపారు. మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో శివ కల్యాణం చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.
- సరిపల్లి శివాలయానికి ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శివుడికి స్వహస్తాలతో అభిషేకాలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు.
- సుజాతనగర్ హరిహక్షేత్రంలో మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు.

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి అర్చకులు విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆకాశదీప మహోత్సం ఘనంగా నిర్వహించారు. ప్రహ్లాదపురం , పాత అడవివరం, విజినిగిరి పాలెం శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

పరవాడ: పరవాడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, తాడిలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, దీపాంజలినగర్ శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

సబ్బవరం: పెదనాయుడుపాలెం శివారు గణపతిపురంలోని స్వయంభూ మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రీబంగారు తల్లి భక్త బృందం గురుస్వామి వెంకటరావు,ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సీఐ రంగనాథం స్వామిని దర్శించుకుని అన్నసమారాధనను ప్రారంభించారు.



పెందుర్తి : శివ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పోలిపాడ్యమికి విశేష ఏర్పాట్లు

సింహాచలం: పోలిపాడ్యమిని పురస్కరించుకుని బుధవారం సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహపుష్కరిణి వద్ద దీపాలు విడిచిపెట్టే భక్తుల సౌకర్యార్థం విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం రాత్రి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసానికి వీడ్కోలు పలుకుతూ పుష్కరిణి వద్ద దీపాలు విడిపిచిపెట్టేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచి వరాహపుష్కరిణికి భారీగా భక్తులు అధికంగా తరలివస్తారన్నారు. ఈఏడాది కూడా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 16మంది దేవస్థానం గార్డులు పుష్కరిణి వద్ద విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. అలాగే 8 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. తొలిపావంచా వద్ద, వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోను వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటిండెంట్ యనమంద్ర అప్పారావు, ఏఈ రాజా తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

రైతులకు న్యాయం చేయాలి

పరవాడ: పరవాడ పెద్ద చెరువులో మత్స్య సంపద చనిపోవడానికి కారణాలపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతు ప్రతినిధులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు మాట్లాడుతూ పీసీబీ అధికారులతో పరవాడ ప్రాంతంలోని చెరువుల్లోని నీటి శాంపిళ్లు సేకరించి కాలుష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులు, పంట పొలాలు కాలుష్యం బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. రైతులు ఆర్.ఆర్.నాయడు, చుక్క గోపి, సిరపరపు నాయుడు పాల్గొన్నారు.

రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి



సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఎలక్ట్రికల్ రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. జీవీఎంసీ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కూడళ్లలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఈ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివైడర్ దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన బోని పద్మ(38) కార్తిక సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీపురం బాల భాస్కర్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. కార్తిక సోమవారం కావడంతో ఉదయం 5.15 గంటల సమయంలో పద్మ తన వదిన పైడి రాజమ్మతో కలిసి దుర్గగుడికి బయలుదేరింది. డివైడర్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు పద్మను ఢీ కొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత విశాఖ

విజయవాడ స్పోర్ట్స్: సూరెడ్డి సత్యనారాయణ(నల్లబాబు) మెమోరియల్ వాలీబాల్ ఇన్విటేషన్ ముగిసింది. టోర్నమెంట్ విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. మహాత్మ కల్చరల్ ఫ్రెండ్స్(ఎంసీఎఫ్) అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన పోటీలకు విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా(ఎంసీఎఫ్), ప్రకాశం జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. విజేత జట్టు విశాఖపట్నం టోర్నీ ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం రాత్రి హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా(ఎంసీఎఫ్) జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

పెందుర్తి: మండల పరిషత్ సమావేశానికి తహసీల్దార్ గైర్హాజరైతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఎంపీపీ మధుపాడ నాగమణి సహా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. తరచూ తహసీల్దార్ తీరు ఇలాగే ఉంటుందని డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మిని ప్రశ్నించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగమణి అధ్యక్షతన సోమవారం వాడీవేడిగా జరిగింది. పలు రెవెన్యూ సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. వాటికి డీటీ సమాధానం చెబుతుండగా.. సభ్యులు అభ్యంతరం తెలిపారు. గత సమావేశానికి కూడా తహసీల్దార్ గైర్హాజరయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యలు తహసీల్దార్‌కు పట్టవా అని సభ్యులు ప్రశ్నించారు. అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని గుర్రంపాలెం సర్పంచ్ గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. గుర్రంపాలెం గ్రామంలో భూముల రీసర్వే సక్రమంగా జరగడం లేదని, రేషన్ సరకులు పంపిణీ సక్రమంగా జరగడం లేదన్నారు. ఇంతలో డీటీ రంగలక్ష్మి విషయాన్ని తహసీల్దార్ శ్యామ్ కు ఫోన్‌లో తెలియ జేయడంతో ఆయన హుటాహుటీన సమావేశానికి హాజరయ్యారు. గ్రీవెన్స్ ఉండడంతో హాజరు కాలేకపోయాని చెప్పారు. మండలంలో భూముల రీసర్వే పూర్తి కాగానే సవరణలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. రేషన్ సరకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి, ఎంపీటీసీలు గండి హిమబిందు, వెంకటరమణ, మాలతి, స్వప్న, సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఎందుకు హాజరు కాలేదని డీటీని ప్రశ్నిస్తున్న ఎంపీపీ నాగమణి

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

పెందుర్తి: రాంపురంలో సాధూ మఠం వద్ద ఉన్న రమా వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. సత్యనారాయణస్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు బ్రహ్మశ్రీ మురళీశర్మ, ఉపేంద్రశర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ఉత్సవమూర్తులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో కార్తీక మాసం నాలుగో సోమవారం పురస్కరించుకొని అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలయుడులు ముఖ్య అతిథులుగా పాల్గొని అన్న సమారాధనను, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

రెడ్ క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డ్ మెంబర్ బోకం జగదీష్, గొంప రమణ, గొర్లి అచ్చంనాయుడు, గొర్లి గంగావతి, బోకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ గోవింద్

గురుకుల విద్యార్థులకు టీషర్టుల వితరణ



విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న గురుకులాల కోఆర్డినేటర్ రూపావతి

సబ్బవరం: జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం టీ షర్ట్‌లు అందజేశారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎస్. రూపాదేవి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల సంగీత ఉపాధ్యాయురాలు వై. విజయ సరస్వతి దాసు ఆర్థిక సాయంతో రూ.10 వేలు విలువ చేసే టీ షర్ట్‌లను సమకూర్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వీవీ సత్యారావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సీఎల్ఎన్ ప్రసాద్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.